# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-08-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం సంజీవని వ్యవస్థను తీసుకువచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

- అమరావతి, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలలో అధునాతన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నామని క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 137వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

- వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం రాబోయే 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

రాష్ట్ర ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం సంజీవని వ్యవస్థను తీసుకువచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అల్లూరి జిల్లా అరకులోయ మండలంలో ఆయన ఈరోజు పర్యటించారు. గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవిని ప్రాజెక్టును, ఆరోగ్య రథాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవల కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి రాకూడదని, అందుకే సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా చర్యలు చేపట్టామని, ఐదు సూత్రాలతో గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ...

(వాయిస్…25 సెకన్లు)-NET

====================

విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. తిరుపతిలోని "అమరావతి ఛాంపియన్ షిప్" పేరిట నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు మంత్రులు కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలతో కలసి స్పీకర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. అమరావతి, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలలో అధునాతన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నామని, పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు.

====================

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భాషా శాస్త్రవేత్త గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా పోస్టు పెట్టారు.

=====================

అగ్నివీర్ పథకం కింద వచ్చేనెల 2వ తేదీ అర్ధరాత్రి నుంచి 20వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న ఆర్మీ నియామక ర్యాలీకి ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి సమీక్ష సమావేశం ఈరోజు నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు ఆర్కే బీచ్ రోడ్డులోని ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి 1.6 కి.మీ రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అన్ని జిల్లాల నుంచి సుమారు 10వేల 350 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 137వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్ అంతటా, AIR News వెబ్‌సైట్, News on air మొబైల్ యాప్‌లో ప్రసారమవుతుంది. అలాగే, AIR News, DD News, PMO.. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల YouTube ఛానెళ్లలో కూడా ఇది ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. హిందీ ప్రసారం ముగిసిన వెంటనే.. ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేస్తుంది.

=====================

విరామం

=====================

రైతుల వ్యవసాయ పెట్టుబడి అవసరాలకు అండగా నిలవడంతో పాటు వారి కుటుంబ ఆదాయాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని అమలు చేస్తోంది. అర్హత కలిగిన రైతు కుటుంబాలకు ఏడాదికి 6 వేల రూపాయల చొప్పున మూడు విడతల్లో నేరుగా ఆర్థిక సహాయం అందిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లా రైతులు ఈ పథకం ద్వారా తమకు అందుతున్న ఆర్థిక సహాయంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయడంతో పాటు పంట సాగుకు అవసరమైన ఖర్చులకు పీఎం కిసాన్ ద్వారా అందే మొత్తాన్ని వినియోగించుకుంటున్నామని పేర్కొంటూ...

(వాయిస్…15 సెకన్లు)-PTC

=====================

రాష్ట్ర వ్యాప్తంగా రేపు నీట్ పీజీ ప్రవేశ పరీక్ష జరగనుంది. విజయనగరం జిల్లాలో రేపు నిర్వహించనున్న నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఈరోజు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల 30నిమిషాల వరకు ప్రవేశ పరీక్ష జరగనుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 475 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని.. అభ్యర్థులు ఉదయం 7 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

=====================

రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ప్రార్థిస్తూ రేపటి నుండి సెప్టెంబర్ 3వ తేదీ వరకు వరుణయాగ, పర్జన్యశాంతి సహిత కారీరిష్టి యాగాలను నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపింది.

=====================

ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు, ఆకాశవాణి 'టాప్ గ్రేడ్' గాత్ర కళాకారులు మల్లాది నారాయణ శర్మ ఏలూరులో ఈరోజు స్వర్గస్థులయ్యారు. ఆకాశవాణితో గత 50 ఏళ్లుగా అనుబంధం వున్న నారాయణ శర్మ భక్తిరంజని, సంగీత రూపకాలు, సంగీత కచేరీలు సమర్పించారు. దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సంగీత సభలలో కచేరీలు చేశారు. నారాయణ శర్మ మృతి పట్ల పలువురు కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

=====================

వాయువ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్-ఉత్తర ఒడిశా తీర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడనం రాబోయే 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలిపారు.

=====================
=====================